రక్షణ చర్యలు చేపట్టండి

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: ప్రైవేటు భవనాల వెలుపల ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లపై వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా భవనాల యజమానులకు నోటీలు అందజేసినట్లు వడ్లపూడి సబ్ స్టేషన్ ఏఈ బి.వీర్రాజు తెలిపారు. ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్లు అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. ట్రాన్స్ ఫార్మర్లు వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఇనుప గ్రిల్స్‌తో భద్రత కల్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నట్లు ఏఈ వివరించారు. అంతే కాకుండా వాటిని ప్రజలు కూడా వినియోగించుకొనేలా చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఏడు గుళ్లకు సమీపంలో నిర్మించిన భవనానికి కూడా అధికారులు నోటీసులివ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హరహర మహా దేవ



సోమనాథ్ , రామేశ్వర ఆలయం, వైద్యనాథ, త్రయంభకేశ్వర, మహాకాళేశ్వరం, భీమ శంకర ఆలయాల నమూనాలు

- ఆకట్టుకుంటున్న ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన
- 27వ వరకు దర్శన భాగ్యం

అగనంపూడి: దేశంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రాలైన ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను అగనంపూడిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం) ఆవరణలో ఏర్పాటు చేశారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఏటా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను సంస్థ ఏర్పాటు చేసి దేశంలోని అన్ని శివాలయాలను దర్శించుకునే భాగ్యాన్ని కల్పిస్తుంది. దీనిలో భాగంగా శ్రీశైల మల్లికార్జున స్వామి, తమిళనాడులోని రామేశ్వరం, గుజరాత్‌లోని సోమనాథ దేవాలయం, భీమశంకర్ ఆలయం (మహారాష్ట్ర), విశ్వనాథ ఆలయం (మధ్యప్రదేశ్), వైద్యనాథుడు (ఝర్ఖండ్), త్రయంభకేశ్వరుడు (మహారాష్ట్ర), మహా కాళేశ్వరం (మధ్యప్రదేశ్) ఇలా దేశంలోని అన్ని శివాలయాల నమూనాలు ఏర్పాటు చేశారు. వాటిని అగనంపూడి పరిసర ప్రాంత భక్తులు దర్శించుకుంటున్నారు. ఈ నెల 27 సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శనం కల్పించనున్నారు.

నేడు ఉదయం నుంచి దర్శనాలు

మహాశివరాత్రి రోజైన బుధవారం ఉదయం నుంచి 27వ తేదీ ఉదయం వరకు దర్శనం కల్పించనున్నట్టు నిర్వాహకులు బీకే వేణి, బీకే సోమేశ్వరి అక్కయ్య, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి చెప్పారు.



జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్న భక్తులు



జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఆర్ఈసీఎస్ ఎండీ ప్రసాద్

దర్శించుకున్న ప్రముఖులు

ఆర్ఈసీఎస్ (కశింకోట) మేనేజింగ్ డైరెక్టర్ జి.ప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, ఈఈ రామకృష్ణ, డీఈఈ శివ శంకర్ ప్రసాద్, ఏఈ లక్ష్మణరావు, నాయకులు సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు మంగళవారం పరమశివుడిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్ల అందజేత



కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీవో నీలవేణి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో జిల్లా పరిషత్ హైస్కూల్లో గాజువాక నియోజకవర్గ అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న కార్యకర్తలకు సీడీపీవో నీలవేణి, ఎంఈవో విశ్వనాథం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ బేగం పాల్గొన్నారు.

పెదగంట్యాడ: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా అభ్యసనతో కూడిన నాణ్యమైన బోధన అందించాలని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులు పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ మేరకు శిక్షణ పొందిన వారికి ఆయన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి, మండల విద్యా శాఖాధికారులు శ్రీనివాసరావు, రమణాజీ పాల్గొన్నారు. డీఈవో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్‌తో పదోతరగతి విద్యార్థుల సన్నద్ధతపై చర్చించారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న బీసీ సెల్ నాయకులు

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన స్వగృహంలో మంగళవారం 87వ వార్డుకు చెందిన ఆ పార్టీ బీసీ సెల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌ను శాలువతో సత్కరించారు. బీసీ సెల్‌లో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన వారు కష్టపడి పని చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో 87వ వార్డు బీసీసెల్ అధ్యక్షులు చిత్రాడ వెంకటరమణ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డగోవింద్, ఎల్ఐసీ నాయుడు,రవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పాత ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించారు. గాజువాక అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మధ్యవర్తుల సమక్షంలో సీఐ కేశవరావు ఆధ్వర్యంలో 25 వాహనాలకు రూ. 75 వేలు వచ్చింది. ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తాతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో డబ్బు ఆదా

ఆర్ఈసీఎస్ ఎండీ ప్రసాద్



గోడపత్రికను ప్రదర్శిస్తున్న ఆర్ఈసీఎస్ ఎండీ ప్రసాద్

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగించడం ద్వారా ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని ఆర్ఈసీఎస్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ అన్నారు. అగనంపూడి ఆర్ఈసీఎస్ సెక్షన్ కార్యాలయంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు రాయితీ ధరకు సోలార్ యూనిట్ అందిస్తుందన్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు వెళ్లి అసోసియేషన్ ప్రతినిధులకుఅవగాహన కల్పించారు. డీఈఈలు ఎస్.రామకృష్ణ,శివశంకర్ వర ప్రసాద్ పాల్గొన్నారు.

11 నుంచి పైడిమాంబ ఉత్సవాలు



మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: వచ్చే నెల 11 నుంచి 18వ వరకూ నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను పైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకర నారాయణ, ములగపాక అచ్చింనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో మంగళవారం ఉత్సవాల పోస్టర్‌ను ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. 11న అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. 17న తొలేళ్లు , 18న అమ్మవారి అనుపు మహోత్సవాన్నివైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తాటికొండ కాశీవిశ్వేరరావు, ములగపాక ప్రసాద్, బత్తిన నాగభూషణం, బొడ్డు కృష్ణారావు, అప్పారావు, సుదర్శన్, రామారావు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

డీఈవో ప్రేమ్‌కుమార్



కళ్లద్దాలు అందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అగనంపూడి: ఒత్తిడికి గురి కాకుండా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. విద్యార్థులు ప్రశ్న పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదవి జవాబులు రాయాలని సూచించారు. అగనంపూడి పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారో ఆరా తీశారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి అగస్త్యా ల్యాబ్ సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపిన అగనంపూడి పాఠశాల విద్యార్థులు జల్లు జశ్వంత్, గరగ రోహిత్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని అభినందించారు. అలాగే మొహిసిన్ ఐ బ్యాంక్ గుర్తించిన 34 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. హెచ్ఎం ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

300 మందికి వైద్య సేవలు



ఆటోనగర్ ఐలా భవనంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఆటోనగర్ డి - బ్లాక్‌లోని ఐలా భవనంలో రైజ్ హాస్పటల్ సౌజన్యంతో ఐలా, వాసీవా, పోవా సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మంది సేవలు పొందారు. ఐలా కమిషనర్ కిశోర్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పద్మావతి, సంయుక్త కార్యదర్శి రామకృష్ణంరాజు, కోటేశ్వరరావు, డాక్టర్ అవినాష్ వేగి పాల్గొన్నారు.



28న విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ కణితి రోడ్డు, 11 కేవీ తుంగ్లాం ఫీడర్ పరిధిలోని 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో ఈ నెల 28న పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ - 2, ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. పంతులుగారి మేడ, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ కాలనీ, కెనరా బ్యాంకు ఏరియా, బీహెచ్‌పీవీ క్వార్టర్స్, బీహెచ్‌పీవీ పోస్టాఫీసు, బీహెచ్‌పీవీ ఎస్‌బీఐ ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.







శివరాత్రి పూజలకు సిద్ధం



కణితిలో ముస్తాబైన ఆలయం

కూర్మన్నపాలెం/పెదగంట్యాడ: శివరాత్రి ఉత్సావాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. 87వ వార్డు కణితి రజకవీధి, సాయివీధి, సంతమామిడితోట, 86వ వార్డులోని మాతృశ్రీనగర్,రాజీవ్‌నగర్, యాదవజగ్గరాజుపేట ప్రాంతాల్లోని ఆలయాలను అలంకరించారు.

- 76వ వార్డు పరిధిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు వుడా కాలనీలోని పంచాయతన ఆలయం,హౌసింగ్‌బోర్డు కాలనీ శివాలయం, బాపూజీ కాలనీ గౌరీ సేవా సంఘం వద్ద, పెదగంట్యాడ శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: మహాశివరాత్రిని పురస్కరించుకొని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని ఉమా రామలింగేశ్వరాలయం ముస్తాబైంది. బుధవారం భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. రద్దీ లేకుండా బారి కేడ్లు పెట్టారు.

ఘనంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ స్టోర్స్ సమీపంలోని యూనియన్ పాయింట్ వద్ద కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కర్మాగార పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నామన్నారు. యూనియన్ నాయకులు గొందేశి వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, జి. అప్పలరెడ్డి, ఎన్. నూకరాజు, వి. అప్పలరెడ్డి, పిట్టా రెడ్డి, బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వీలైనంత త్వరగా జీతాలు చెల్లించాలని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) మొహంతి ఆదేశించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంపై స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు ఆర్ఎల్‌సీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఆర్ఎల్‌సీ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి, యాజమాన్యం తరఫున ఫైనాన్స్ డీజీఎం రామ్‌ప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ వై.హెచ్. శంకర్ హాజరయ్యారు. దశల వారీగా జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఉక్కు ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఉక్కునగరం: ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పారావు తెలిపారు. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 4వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయం ప్రాంగణంలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు నివేదిక అందజేశారు. కోశాధికారి ఉండవల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడిని రక్షించిన దువ్వాడ పోలీసులు

కూర్మన్నపాలెం : అప్పికొండ సముద్ర తీరంలో ఆత్మహత్యకు యత్నించిన బాలుడిని దువ్వాడ పోలీసులు రక్షించారు. జీవీఎంసీ 77వ వార్డు అప్పికొండలో తల్లిదండ్రులతో కలసి నివాసం ఉంటున్న బాలుడు అల్లర చిల్లరగా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. మళ్లీ తండ్రి కొడతాడనే భయంతో బాలుడు అప్పికొండ బీచ్ వైపు వెళ్లిపోయాడు. దీంతో బాలుడి తల్లి ఆందోళనతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.మల్లేశ్వరరావు నేతృత్వంలో సిబ్బంది లైఫ్ గార్డ్స్ సహకారంతో సుమారు గంటన్నరపాటు గాలించారు. చివరికి బాలుడు లభ్యం కావడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.















